క్లుప్తంగా

చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి


ఎస్‌ఐ దిలీప్‌కుమార్

కురబలకోట: మండలంలోని ముదివేడు దండు మారెమ్మ తిరునాల సందర్భంగా ఊరేగించే చాందినీ బండ్లకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ముదివేడు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా మెరువన సాగించడానికి వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదన్నారు. నిర్దేశించిన సమయం మేరకే మైక్ సెట్లు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కల్గించరాదన్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీలేరు ఇన్‌చార్జి సర్వేయర్‌గా పూర్ణచంద్ర

పీలేరు రూరల్ : పీలేరు మండల ఇన్‌చార్జి సర్వేయర్‌గా డి. పూర్ణ చంద్రను నియమిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు కేవీపల్లె సర్వేయర్ ఎస్. కీర్తన పీలేరుకు ఇన్‌చార్జి సర్వేయర్‌గా పని చేశారు. వాల్మీకిపురం సర్వేయర్‌గా ఉన్న డి.పూర్ణచంద్రను ఇన్‌చార్జి సర్వేయర్‌గా నియమించారు.

సభ విజయవంతం

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో ఆదివారం జరిగిన సీపీఐ శత వసంతాల వేడుకలు విజయవంతం అయ్యాయని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ కార్యదర్శి నారాయణ హజరైన ఈ వేడుకలను నిర్వహించడంలో పార్టీ శ్రేణులు, నాయకులు సహాయ సహకారాలు అందించారని అన్నారు. అందరి తోడ్పాటుతో సభను విజయవంతం చేశామని సంతృప్తి వ్యక్తం చేశారు.

వెలుగు పాఠశాలకు టీవీ వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలకు సోమవారం వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్ టీవీ, టేబుల్‌ను వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన కళ్యాణ్, నాగరాజ గుప్తా, సుందరమ్మల జ్ఞాపకార్థం అందించారు. వీటిని వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌కు ఇచ్చారు. వెల్‌విషర్స్ సంస్థకు అభినందనలు తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ ఉషారాణి

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం గ్రామంలో ఎంపీ నిధులతో మంజూరైన వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాల్సిందిగా సర్పంచ్ ఉషారాణి, తహసీల్దార్ అమరనాథ్‌ను కోరారు. సోమవారం తహసీల్దార్‌కు స్థలం కేటాయింపుపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని శిథిలావస్థలో ఉన్నటువంటి చావిడి, బందలదొడ్డికి సంబంధించిన సుమారు 5 సెంట్ల స్థలం నిరుపయోగంగా ఉందని, వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకై పంచాయతీ ఇప్పటికే తీర్మానం చేసిందన్నారు.

ఘనంగా గట్టు వెంకటేశ్వర స్వామి దోపోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు రామచంద్రభట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే రామసముద్రం దిగువపేటలో వెలసిన శ్రీ చంద్రశేఖరస్వామి ఉత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలస్వామి, రవిస్వామిలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాయితీపై జిప్సం, వేపనూనె

పెద్దతిప్పసముద్రం: రైతులకు రాయితీపై జిప్సం, వేపనూనె అందజేస్తున్నామని ఏవో ప్రేమలత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 800 బస్తాల జిప్సం మంజూరైందన్నారు. 50 కిలోల జిప్సంకు రాయితీపోగా రూ.155లకు, లీటర్ వేపనూనె రూ.300లకు, రెండు కిలోల సూక్ష్మ పోషకాల కిట్ రూ.250లకు అందజేస్తామన్నారు. రైతులు ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం, మొబైల్ ఫోన్‌తో రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతం



మదనపల్లె ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష గది నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు


గుర్రంకొండలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


రామసముద్రం : విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


పీలేరు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


కలకడ పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలో 50 కేంద్రాల్లో 9,294 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 9,188 మంది హాజరయ్యారు. ఇందులో 106 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. చాలా మంది ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలకు 9 గంటలకు అనుమతిచ్చారు. మదనపల్లె పట్టణం, రూరల్ పరిధిలో 18 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్ వస్తువులు, సెల్‌ఫోన్లు అనుమతించలేదు. విద్యార్థుల కోసం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించారు.

పీలేరులో..

పీలేరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని 9 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 1509 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1500 మంది హాజరయ్యారని, తొమ్మిది మంది గైర్హాజరైనట్లు వివరించారు.

పదిమంది గైర్హాజరు

కలికిరి: మండల పరిధిలోని మూడు పదవ తరగతి పరీక్షా కేంద్రాలల్లో పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఒ కరీముల్లా తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 196 మందికి 192 విద్యార్థులు, బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 209 మందికి 208, మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 110 మందికి 105 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలకు మొత్తం 318 మంది విద్యార్థులకుగానూ తొమ్మిది మంది గైర్హాజరైనట్లు ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు. సోమవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 173 మంది విద్యార్థులకు గానూ ఆరుగురు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే స్థానిక ఉర్దూ జెడ్పీ హైస్కూల్లో మొత్తం 145 మంది విద్యార్థులకుగానూ ముగ్గురు విద్యార్థులు పరీక్షలు గైర్హాజరైనట్లు తెలిపారు. కాగా రెండు పరీక్ష కేంద్రాల వద్ద ఏఎస్‌ఐ నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులను తనిఖీ చేసి అనుమతించారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రెడ్డిబాషా తెలిపారు. సోమవారం మండలంలోని కేవీపల్లె జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 424 మంది విద్యార్థులకు గానూ 415 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్లో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 264 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సరస్వతి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ ద్వారకనాథ్ తనిఖీ చేశారు. స్థానిక ఎస్‌ఐ హరిహర ప్రసాద్ 144 సెక్షన్ అమలు చేశారు.

ఐదుగురు గైర్హాజర్

బి.కొత్తకోట: తొలిరోజు సోమవారం జరిగిన పదవ తరగతి తెలుగు పరీక్షకు బి.కొత్తకోటలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 860 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. వీరిలో 855 మంది హాజరై పరీక్ష రాశారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు

పెద్దమండ్యం: మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కలిచెర్ల తెలుగు, పెద్దమండ్యం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెద్దమండ్యం పరీక్షా కేంద్రంలో యల్లంవారిపల్లె, మోడల్ పాఠశాల, పెద్దమండ్యం ఉన్నత పాఠశాల విద్యార్థులు 208 మంది పరీక్షలకు హాజరు కాగా, 9 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే కలిచెర్ల తెలుగు ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో శిద్దవరం కెజిబివి, వెలిగల్లు, కలిచెర్ల ఉర్దూ, కలిచెర్ల తెలుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు 176 మంది పరీక్షలకు హాజరు కాగా, 8 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. జెడ్పీ హైస్కూల్ తెలుగు కేంద్రంలో తెలుగు పరీక్షకు 326 మంది విద్యార్థులకు గాను 319 మంది హాజరయ్యారు. 7మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ పద్మావతి తెలిపారు. ఎస్‌ఐ తిప్పేస్వామి బందోబస్తు నిర్వహించారు. ఎంఈఓ ఎం.ఆర్.పద్మావతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాల్లో 507 విద్యార్థులకు గాను 502 మంది హాజరుకాగా, 5 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ–2 ఆంజనేయులు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక అధికారి హర్షవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణ చేశారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలో సోమవారం నాలుగు కేంద్రాల్లో ప్రారంభమైన పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా నాలుగు కేంద్రాల్లో 709 విద్యార్థులకు గాను 698 మంది హాజరైనట్లు, 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ వెంకటరమణ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ నరసింహుడు, ఎంఈఓ వెంకటరమణ పరిశీలించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో సోమవారం మొదటి రోజు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జెడ్పీ ఉన్నతపాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, డీఓ మహమ్మద్‌రఫీల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 122 మంది విద్యార్థులకు గాను 121 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కలకడలో..

కలకడ : మండలంలోని మూడు కేంద్రాలలో 10వతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు మండల విద్యాశాఖ అధికారి మునేంద్రనాయక్ తెలిపారు. పరీక్షల చీఫ్‌గా సోమశేఖర్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా రాములు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంకు 200 మీటర్ల దూరం వరకూ 144సెక్షన్ అమలు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామ పంచాయతీని అభివృద్ధి చేద్దాం


మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు మేజర్ గ్రామ పంచాయతీని కలసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ హబీబ్ బాషా అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తాను పని చేసిన మూడు సంవత్సరాల కాలంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని పేర్కొన్నారు. తాను సెలవుపై వెళ్లిన 11 నెలల కాలంలో దుర్వినియోగం అయినట్లు తెలిపారు. ఈవో గురుమోహన్ మాట్లాడుతూ తాను ఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాటికి రూ. 3 కోట్లు పెడింగ్ బిల్లులు ఉన్నాయని, 9 నెలల కాలంలో సర్దుబాటు చేస్తూ పంచాయతీని అభివృద్ధి వైపు నడిపిస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి గతంలో జరిగిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయుట గురించి చర్చించారు. స్థానిక వారపు సంత ప్రాంగణంలో రోడ్డుపైనే అక్రమ నిర్మాణాలు జరిగాయని, దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, తొలగించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన మహిళపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి


గిరిజన మహిళకు న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్న ఆర్జీఎస్, బాస్ నాయకులు

మదనపల్లె : గుర్రంకొండ మండలం శీలంవారిపల్లె గిరిజన మహిళ ఎరుకుల అలివేలమ్మపై దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని రాష్ట్ర గిరిజన సమాఖ్య(ఆర్జీఎస్) వ్యవస్థాపకులు కోనేటిదివాకర్, బాస్ జిల్లా నాయకులు ముత్యాలమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అలివేలమ్మకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గిరిజన మహిళపై దాడి జరిగి నాలుగురోజులు అవుతోందని, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే...ఇప్పటివరకు ప్రభుత్వం కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఒక మహిళను ఊరంతా చూస్తుండగా వివస్త్రను చేసి కొట్టడం సిగ్గుచేటు కాదా అని మండిపడ్డారు. కూటమిప్రభుత్వంలో గిరిజన మహిళపై దాడులు జరగడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధిత మహిళకు చికిత్స చేయించి, కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలన్నారు. హోంమంత్రి ఘటనపై స్పందించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన దళిత నాయకులు వసంతమ్మ, శివప్రసాద్, చిన్నప్ప, శ్రీనివాసులు, శివనాయక్, గీత, నందీష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మదనపల్లె : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, సురేష్ కుమార్, నాగరాజు మాట్లాడుతూ..పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లు ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్‌ఐలో నెలకున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. పారిశుధ్య పనుల కోసం 8 నెలల క్రితం తీసుకున్న 80 మంది కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలన్నారు. డైలీ వేజెస్ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో వరద సహాయనిమిత్తం మదనపల్లె మున్సిపాలిటీ నుంచి వెళ్లిన 40 మంది పారిశుధ్య కార్మికులకు ఇతర మున్సిపాలిటీల్లో ఇచ్చిన విధంగా ఎలాంటి గౌరవ వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న నూనె, సోపులు, బట్టలు, చెప్పులు, కుట్టుకూలీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముబారక్, తిరుమలప్ప, పృథ్వీరాజ్, ఇంద్రాణి, గంగులప్ప, నాగరాజు, వంశీ, శంకర, ప్రసాద్, శ్రీనివాసులు, వాసు, కార్మికులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు


పశుగ్రాస విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న డాక్టర్ విక్రమ్‌రెడ్డి

పెద్దమండ్యం: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని వెలిగల్లు పశువుల ఆస్పత్రి వద్ద పాడిరైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ 75 శాతం రాయితీపై ప్రభుత్వం పశుగ్రాస విత్తనాలను ఇస్తున్నట్లు తెలిపారు. వెలిగల్లు, కలిచెర్ల, పెద్దమండ్యం పశువైద్య కేంద్రాలలో పశుగ్రాస విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డును తీసుకుని వెళితే రాయితీ పశుగ్రాస విత్తనాలు పొందవచ్చని చెప్పారు. అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేకు మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకి ఆశీస్సులను అందించారు. ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి వేదపండితులు ఎమ్మెల్యేకి వివరించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేని ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్దమండ్యం పాతూరులో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, మాజీ జడ్పీటీసీ జి రమేష్, జిల్లా పార్టీ యాక్టివిటీ కార్యదర్శి భైన మధూకరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె రామక్రిష్ణ, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, జింకా విశ్వనాథ, కంటె విశ్వనాథరెడ్డి, పీరాన్‌బీ, ఎంపీటీసీలు మంచూరి జయరాం, బోడిమాని గీత, నాయకులు కేశవ, రామిరెడ్డి, హరిక్రిష్ణారెడ్డి, గల్లా నరసింహులు, పీరన్న పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

పీలేరు : ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, యర్రమరాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్, ఐఆర్ ప్రకటించాలన్నారు. గత పీఆర్‌సీ డీఆర్ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. అడిషన్ క్వాంటమ్ పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలకు పది శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం చొప్పున పునరుద్ధరణ చేయాలన్నారు. ఈహెచ్‌ఎస్‌ఐ పూర్తి స్థాయిలో వైద్యం అందుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షయవ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత


క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున వైద్య సిబ్బంది

పీలేరురూరల్ : క్షయవ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత అని డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలో ఉచితంగా గళ్ల పరీక్ష చేపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్ కుమార్, సీహెచ్‌వో జయలక్ష్మీ, పర్యవేక్షకులు చిన్నప్ప, ఆరోగ్యకార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి.. సారూ..!

– పీజీఆర్‌ఎస్‌లో మొరపెట్టుకున్న బాధితులు


సబ్ కలెక్టర్ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధులు

మదనపల్లె : ‘ ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. కనీసం మీరైనా మా సమస్యలు పట్టించుకుని పరిష్కారానికి కృషి చేయండి సబ్ కలెక్టర్ సార్' అంటూ బాధితులు ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో మొరపెట్టుకున్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీలు అందజేశారు.

కొడుకు ఇంటి నుంచి గెంటేశాడు

ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె గ్రామం బూడిదగడ్డపల్లెకు చెందిన ఎం.పెద్దవెంకటరమణ భార్య ఎం.చిన్నలక్ష్మమ్మ.. తనకు నలుగురు కుమారులని, గ్రామంలో తాను కొనుగోలు చేసిన రెండు ఇంటి స్థలాలను, మూడో కుమారుడు తాను కొనుగోలు చేసిన ఇంటి స్థలంతో కలుపుకొని, మిగిలిన ముగ్గురు కుమారులకు ఎలాంటి హక్కులు కల్పించకుండా అగ్రిమెంటు తన వద్ద ఉంచుకున్నాడని చెప్పింది. వృద్ధాప్యంలో ఉన్న భార్యాభర్తలమైన తమ ఇద్దరికీ అన్నం పెట్టకుండా ఇంటి నుంచి బయటకు పంపేయడంతో బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నామని, మూడో కుమారుడు ఆక్రమించుకున్న ఇంటి స్థలాలను ఇప్పించాల్సిందిగా వేడుకున్నారు.

ఇంటిని ఎమ్మార్వో కూల్చేస్తామంటున్నారు

రామసముద్రం మండలం మానేవారిపల్లె పంచాయతీ చిట్టెంవారిపల్లెకు చెందిన సునీత.. తనకు గత ప్రభుత్వంలో మంజూరు చేసిన కాలనీ ఇంటిని మండల తహసీల్దార్ జేసీబీతో కూల్చేస్తామని బెదిరిస్తున్నారంటూ వాపోయింది. గ్రామంలో దారి సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్న కోపంతో, హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో అన్ని బిల్లులు పొంది, ప్రభుత్వం మంజూరు చేసిన లేఔట్‌లో నిర్మించుకున్న ఇంటిని శ్మశాన వాటికలో కట్టుకున్నామంటూ కూల్చేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్నారని, ఎలాగైనా తమ ఇంటిని కాపాడాలని వేడుకుంది.

పెన్షన్ ఇప్పించండి



కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన బొమ్మరాజు.. తనకు పక్షవాతం వచ్చి రెండేళ్లు అవుతోందని, ప్రమాదంలో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిందని, పెన్షన్ ఇప్పించాల్సిందిగా వేడుకున్నాడు. పెన్షన్ కోసం ఇప్పటి వరకు సబ్ కలెక్టరేట్, ఎంపీడీఓ కార్యాలయంలో 15 సార్లుకు పైగా అర్జీలు ఇచ్చానని, అధికారులు స్పందించడం లేదని, తనకు పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు. భార్యాపిల్లలు తనను పోషించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పెన్షన్ ఇస్తే తనను వారు బాగా చూసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశాడు.

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండలో వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తుల సౌకర్యం కోసం మదనపల్లె వన్ డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సుల సర్వీసులు ఏర్పాటు చేశారు.